క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 105 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. శిబిరంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, శంకర్, దివ్య పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు 32 మంది ఎంపిక

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు. ఇక్కడ చదివిన అనకాపల్లి జిల్లా తురువోలు గ్రామానికి చెందిన జె.కల్పన పదో తరగతి పరీక్షల్లో అత్యధికంగా 591 మార్కులు సాధించగా ఆమెకు నూజివీడు కళాశాలలో సీటు వచ్చింది. అలాగే శ్రీకాకుళంలో 17 మందికి, నూజివీడులో 8 మందికి, ఒంగోలులో ఏడుగురికి సీట్లు వచ్చాయి. సీట్లు సాధించిన విద్యార్థినులకు పాఠశాల ప్రిన్సిపాల్ కోడి రాంబాబు అభినందనలు తెలిపారు.

పీఆర్‌టీయూ భీమిలి కార్యవర్గం

తగరపువలస: పీఆర్‌టీయూ భీమిలి మండలం నూతన కార్యవర్గాన్ని సభ్యుల సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ముద్దాడపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సువ్వారు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మజ్జివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.రమణారావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఆల్బర్ట్ సుదర్శన్, కోశాధికారిగా ఉదయభాస్కర్ ఎంపిక య్యారు. పీఆర్‌టీయూ కౌన్సిలర్ మురళీ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

అమ్మవార్లకు సారె సమర్పణ



అమ్మవార్లకు సమర్పించడానికి సారె తీసుకెళ్తున్న మహిళలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేట మహిళలు ఆదివారం కార్మిక నాయకుడు దల్లి అప్పలరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు సారె సమర్పించారు. మేళతాళాలు, కలశాలతో పాదయాత్రగా బొగ్గులదిబ్బలోని పోలమ్మతల్లి, దుర్గాలమ్మ, గ్రామంలో ఉన్న ఎల్లమ్మతల్లి, మరిడమ్మ పేరంటాళ్లకు వీటిని సమర్పించారు. వేడుకల్లో పలువురు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మీనామృతం పిచికారీతో తెగుళ్ల నివారణ



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది



ఆనందపురం మండలం తర్లువాడలో మీనామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పద్మనాభం: మీనామృతాన్ని పంటలకు పిచికారీ చేస్తే చీడ పీడలను నివారించ వచ్చని ప్రకృతి వ్యవసాయం గ్రోత్ ప్రమోటర్లు ఆర్.మీనా, జ్యోతి సూచించారు. మండలంలోని పొట్నూరు, గంధవరం గ్రామాల్లో మీనామృతం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీనామృతాన్ని పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పది కిలోల చేపల పొట్టు, పది కిలోల బెల్లం కలిపి 40 రోజులు మగ్గబెడితే మీనామృతం తయారవుతుందని చెప్పారు. రెండున్నర లీటర్ల మీనామృతాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి ఎకరం విస్తీర్ణం గల పంటకు పిచికారీ చేయాలని సూచించారు. మీనామృతం చల్లడం వల్ల మొక్క పెరుగుదల బాగుంటుందన్నారు. కార్యక్రమాల్లో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు కోట లక్ష్మి, మహేశ్వరి పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు మీనామృతం దోహదం

ఆనందపురం : పంటలులో అధిక దిగుబడులకు మీనామృతం ఎంతో దోహదపడుతుందని యూనిట్ ఇన్‌ఛార్జి రామారావు తెలిపారు.

మండలంలోని తర్లువాడలో ఆదివారం మీనామృతం తయారీపై రైతులకు శిక్షణ అందించారు. చేపల వ్యర్థాలు, బెల్లంతో మీనామృతాన్ని చాలా తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చని, దీని ఫలితం మాత్రం ఎక్కువగా ఉంటుందని వివరించారు. చేపల వ్యర్థాలు, బెల్లం ఒక డ్రమ్ములో పొరలుగా వేసి రోజూ ఉదయం సాయంత్రం కలియబెడితే మీనామృతం తయారవుతుందన్నారు. 200 లీటర్ల నీటిలో 2 లీటర్ల మీనామృతాన్ని కలిపి ఆకు కూరలు, కూరగాయలు పంటలపై పిచికారీ చేస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ముడి సరుకులతో మీనామృతాన్ని ఎలా తయారు చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సలహాదారు చక్రవర్తి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పైడిరాజు, వెంకటలక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డు సరిచేయడంతో శస్త్రచికిత్స



నాయుడు సాయికి ఆస్పత్రిలో ఈకేవైసీ చేస్తున్న వలంటీరు సూరిబాబు (ఫైల్)

ఆనందపురం : ఆనందపురం గ్రామానికి చెందిన నాయుడు సాయి అనే యువకుడు గత ఏడాది రోడ్డు ప్రమాదానికి గురికావడంతో చేయి విరిగిపోయింది. వెంటనే మధురవాడలోని గాయత్రి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆరోగ్యశ్రీ కార్డులో పురుషుడుకు బదులు స్త్రీ అని నమోదై ఉన్నందున ఉచితంగా శస్త్ర చికిత్స చేయమని ఆస్పత్రి సిబ్బంది చెప్పేశారు. దీంతో కన్నీటి పర్యంతమైన సాయి తల్లిదండ్రులు వలంటీరు చెక్కా సూరిబాబుకు విషయం చెప్పారు. వెంటనే స్పందించిన వలంటీరు సూరిబాబు గాయత్రి ఆస్పత్రికి వెళ్లి బాధితుడికి ఈకేవైసీ అప్‌డేట్ చేసి ఆరోగ్యశ్రీ కార్డులో మార్పులు చేయించారు. దీంతో సాయికి ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు.

అప్పుల పాలయ్యేవాడిని..

వలంటీరు సూరిబాబు సకాలంలో స్పందించకపోయి ఉంటే ఆపరేషన్‌కు డబ్బుల కోసం అప్పులు పాలయ్యేవాడిని. ఆపరేషన్‌కు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. దాంతో తీవ్ర వేదనకు గరయ్యాము. వలంటీరు చేసిన సాయం వల్ల ఉచితంగా శస్త్ర చికిత్స చేయించుకోగలిగాం.

– నాయుడు సాయి, ఆనందపురం

ప్రభుత్వ స్థలంలో దర్జాగా దుకాణాలు



బంగ్లామెట్ట వద్ద కళాశాల బాలుర వసతి గృహం, షాదీఖానా మధ్య దుకాణం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని ప్రభుత్వ స్థలాల్లో రాత్రికి రాత్రి పోటాపోటీగా కొత్తగా దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. తర్వాత వీటిని తొలగించడానికి టౌన్ ప్లానింగ్, సచివాలయ ప్లానింగ్ అధికారులకు మొహమాటం అడ్డు వస్తుంది. పట్టపగలే భీమిలి రోడ్డు, బైపాస్ రోడ్డులో రెడీమేడ్ దుకాణాలు వెలుస్తున్నా ఆదిలోనే వాటికి అడ్డు చెప్పకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటీవల జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ గుర్తించిన వరకు స్థానిక సిబ్బంది పట్టించుకోలేదు. ఆయన ఆదేశాలతో పట్టుబట్టి మరీ అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, ప్రభుత్వ, ప్రైవేట్ గోడలపై పోస్టర్లు అతికించడం వంటి విషయాలపై జీవీఎంసీ కమిషనర్ సీరియస్‌గా వ్యవహరిస్తున్నా టౌన్ ప్లానింగ్ సిబ్బందికి పట్టకుండా ఉండటం వెనుక రహస్యం ఏమై ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మొదట్లో ఒకరిని పట్టించుకోకుండా వదిలేయడంతో మిగిలిన వారు కూడా వారితో పోటీ పడి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొదట్లోనే ఇలాంటి అక్రమ నిర్మాణాలు తొలగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు.

'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని తర్లువాడ, పాలవలస పంచాయతీల్లో సోమవారం సాయంత్రం 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు.

ఎంఈవో – 1గా రమణ

పద్మనాభం: పద్మనాభం మండల విద్యాశాఖ అధికారి – 1గా పొన్నగంటి రమణను నియమించారు. ఈ మేరకు ఆర్జేడీ జ్యోతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను భీమునిపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రేడ్ – 2 హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఈయనను పద్మనాభం మండల విద్యాశాఖ అధికారి – 1గా నియమిస్తూ ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు.

దర్జాగా టీడీపీ నేత కబ్జా



కొమ్మాది ఓజోన్ వ్యాలీ లే అవుట్ సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన పాకలు

- పరదేశిపాలెంలో 500 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- తక్షణమే చర్యలు చేపడతామన్న తహసీల్దార్ రమణయ్య

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడలో టీడీపీ మాజీ కార్పొరేటర్ అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. అక్రమాల్లో ఆరితేరిన ఈ నాయకుడు తాజాగా ఓజోన్ వ్యాలీ లే అవుట్‌ని ఆనుకుని మారికవలస గ్రామానికి ఇవతలి వైపు పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 121, 122లో సుమారు 500 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమించేశాడు. ఈ స్థలం విలువ ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.2 కోట్లు పైమాటే. ఈ స్థలంలో 4 కమ్మల పాకలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిని తన మిగులు భూమి అని కూడా ప్రచారం చేస్తున్నాడు. ఇందులో మేకలు, గొర్రెల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి కోట్ల రూపాయల విలువ చేసే భూమిలో పాగా వేసేశాడు. అంతటితో ఆగకుండా ఒకటి తర్వాత ఒకటి చొప్పున షెడ్లు వేసుకుంటూ గెడ్డను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని అంచెలంచెలుగా ఆక్రమించేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా సచివాలయ సిబ్బంది మాత్రం ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు.

ఈ విషయమై తహసీల్దార్ సనపల రమణయ్య వివరణ కోరగా... పాకలు నిర్మించినది వీఎంఆర్‌డీఏ గ్రీన్ బెల్ట్ ఏరియాకి చెందిన ప్రభుత్వ భూమి అని, విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే ఓ పాకను తమ సిబ్బంది తొలగించారని, మిగిలినవి తొలగించేందుకు సదరు వ్యక్తి రెండు రోజుల సమయం కోరారని చెప్పారు.

ఆట వస్తువుల పంపిణీ



ఆట వస్తువులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు, నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆట వస్తువులు ఆదివారం పంపిణీ చేశారు. 3 నెలల క్రితం ఈ సంస్థ ప్రతినిధులు పిల్లల అవసరాలపై సర్వే నిర్వహించగా ఆట వస్తువులు కావాలని అత్యధికులు చెప్పడంలో 100 మందికి ఉచితంగా అందజేశారు. ఈ సామగ్రిని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా వైస్ ప్రెసిడెంట్ ప్రేమకుమారి, నాయకులు టి.ప్రదీప్‌కుమార్ తదితరులు అనంతరం నిర్వాహకులను అభినందించారు. సంస్థ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.సుబ్బలక్ష్మి, బీజేపీ జోనల్ ఇన్‌చార్జి రోహిణి, ఉమ్మడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీ వేంకటేశ్వరస్వామి నృత్య ప్రదర్శనలో కళాకారులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గల ధార్మిక వేదికపై ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి జీవిత చరిత్రపై నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సాయంత్రం వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎండీయూ ఆపరేటర్ల మాయాజాలం

మ్యాపింగ్ లేనిచోట్లకు వాహనాల తరలింపు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో ఎండీయూ ఆపరేటర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మ్యాపింగ్ చేయనిచోట కూడా రాత్రివేళ వాహనాలు ఉంచి సరకులు విక్రయిస్తుండటం వివాదాస్పదమవుతోంది. సచివాలయాలు, రేషన్ డిపోల వద్ద కాకుండా ఆపరేటర్లు రాత్రి వేళ తమ ఇంటి వద్దకే వాహనాలు తరలించి సరకుల మాయాజాలం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నెల 14న 'ఎండీయూ ఆపరేటర్ల చేతివాటం' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన వార్తకు పలువురు ఆపరేటర్లు స్పందించారు. ఒకరిద్దరు ఆపరేటర్లు చేస్తున్న తప్పిదాలకు అధికారులు, ప్రజల ముందు తామంతా చులకన అవుతున్నామని అంటున్నారు. ఎండీయూ వాహనాలపై పౌరసరఫరాల శాఖ అధికారుల నిఘా లేకపోవడమే దీనికి కారణమని అంటున్నారు. గతంలో బయట వ్యాపారులు వినియోగదారుల ఇళ్ల నుంచి బియ్యం కొనుగోలు చేస్తుండేవారని... ఇప్పుడు ఆపరేటర్లే వాహనాల వద్ద ఈ అవకతవకలకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకుల విక్రయాలపై భీమిలి జోన్‌లో ప్రక్షాళన జరగాలని పలువురు కోరుతున్నారు.

హాకర్స్ జోన్ ఏర్పాటుకు డిమాండ్



మధురవాడలో నిరసన తెలుపుతున్న నాయకులు

మధురవాడ: మధురవాడలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని చిల్లర వర్తకులు, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మధురవాడ జంక్షన్‌లో నిరసన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక చాలా మంది స్వయం ఉపాధి కోసం జంక్షన్లు, ఫుట్‌పాత్‌ల మీద తోపుడు బళ్లు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటూ ప్రభుత్వానికి పన్నులు కూడా చెల్లిస్తున్నారని చెప్పారు. వీరి ఉపాధికి నష్టం వాటిల్లకుండా హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖ నగరంలో ప్రభుత్వం చేసిన చట్టాన్ని అమలు చేయకుండా చిల్లర వర్తకులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఫుట్‌పాత్ అండ్ తోపుడు బళ్ల కార్మిక సంక్షేమ సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వామనమూర్తి పాల్గొన్నారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింప జేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తు లు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంప జేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం , కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సర్వీస్ రోడ్లపై మురుగు ప్రవాహం



సబ్బివానిపేట వద్ద శిథిలమైన సిమెంట్ పలకల నుంచి సర్వీస్ రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగు

తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డు సంగివలస, సబ్బివానిపేట గ్రామాల మధ్య డ్రైనేజీల నుంచి మురుగునీరు సర్వీస్ రోడ్లపై పొంగి ప్రవహిస్తోంది. ఈ మార్గంలో పలుచోట్ల డ్రైనేజీల పైనుంచి భారీ వాహనాలు దాటుతుండడంతో సిమెంట్ పలకలు విరిగిపోతున్నాయి. ఇప్పటికే ఈ డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, దీనికితోడు అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో చాలాసార్లు స్థానికులు డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలని నేషనల్ హైవే అథారిటీకి ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదు. నిర్మాణ సమయంలో డ్రైనేజీలు లోపభూయిష్టంగా ఉండటంతో ఇప్పుడు మురుగునీటి ప్రవాహానికి అనుకూలంగా లేవు. ముందుముందు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టి పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ ప్లే ఎరీనా అకాడమీ ప్రారంభిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు

కొమ్మాది: క్రీడలు పిల్లలకు మానసిక ఉల్లాసంతో పాటు ఉత్తేజాన్ని కలిగిస్తాయని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వై.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గులామ్ ఫారూక్ క్రికెట్ ప్లే ఎరీనా అకాడమీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ పిల్లలకు ఉచిత శిక్షణ అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. పిల్లలు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కెనడీ, కోచ్ గులామ్, వెంకట్ కాశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారామ ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



ఆశ్రమ గురువు కుటుంబాన్ని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సీతారామ ఆశ్రమంలో గురుదేవుడు సీతారాం పుణ్యారాధన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. శనివారం ఉదయం నుంచి 24 గంటల పాటు సాగిన హరే రామ హరే కృష్ణ నామసంకీర్తన ఆదివారం ఉదయం ముగిసింది. అనంతరం భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు అధ్యక్షతన ఆధ్యాత్మిక సభ నిర్వహించారు. వల్లపూడికి చెందిన ప్రవచనకర్త రామకృష్ణానంద 'గురువు – జగద్గురువు' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సీతారాం గురుదేవుని కుటుంబ సభ్యులను నిర్వాహకులు ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్మలానంద స్వామి, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, శింగనబంద సర్పంచ్ గాడు వెంకటనారాయణ, అయ్యప్పస్వామి, సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, గుడ్డాల ఎల్లయ్య, గాడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

తగరపువలస: తాము రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాస్తవ సేవా సంఘం ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు పిట్టా సురేష్ తెలిపారు. కొత్తపేట కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ – శ్రమ రిజిస్ట్రేషన్ ద్వారా అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి, పేదలకు బీమా, ఇతర ప్రయోజనాల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. దీనికోసం త్వరలో పేర్ల నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన కార్యవర్గ సభ్యుడు మేకల ముత్యాలరావుకు సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బల్లా వెంకటరావు, గుదే నానాజీ, భీమరపు ప్రకాష్‌రావు, దీవి రామకృష్ణ, పతివాడ శ్రీనివాసరావు, తమ్మిన సూర్యప్రకాష్‌రావు, పిల్లా రాజేష్, జోగ సన్యాసిరావు, పల్లా అప్పలకొండ, అవనాపు శ్రీనివాసరావు, ఉండవల్లి చంద్ర, ముత్యాల వెంకటేశ్వరరావు, పిట్టా తోటయ్య, ఊళ్ల దుర్గారావు, పిట్టా రామారావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం పోలిస్ స్టేషన్‌లో సీఐ డి.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనవసరమైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఇబ్బందులు సృష్టించినా సహించేది లేదన్నారు. ప్రతి ఒక్కరిపైనా నిఘా ఉంటుందని, నడవడిక సరిగ్గా లేనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ ప్రాంతాల్లో ఎవరైనా ఇబ్బందులకు గురిచేయడంతోపాటు గొడవలు చేస్తే ప్రజలు నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్ఐ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే పరీక్షలకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించడానికి ఈ నెల 25 వరకు గడువు పెంచారు. రూ.10 అపరాధ రుసుముతో ఈ నెల 26 నుంచి 31 వరకు గడువు విధించారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశికతో పాటు హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు రాయాలనుకునే అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఇతర సూచనలకు సంప్రదించాలని ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు సూచించారు. వివరాలకు 89858 97419లో సంప్రదించాలని కోరారు.